క్లుప్తంగా

స్నేహితుడి కూతురి వివాహానికి చేయూత



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం గ్రామంలో కడప భాస్కర్– సువార్తల కుమార్తె ప్రియాంక వివాహానికి కడప భాస్కర్ స్నేహితులు చేయూతనందించారు. రాయినిగూడెంలో 1992 విద్యా సంవత్సరంలో భాస్కర్‌తో పాటు పదో తరగతి కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.33వేలను గురువారం జరిగిన వివాహ వేడుకలో కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండు రామాంజీగౌడ్, శ్రీరామయ్య, సతీష్, అంతయ్య, ముస్తఫా, మేకల సత్యనారాయణ, సునిత, వెంకటలక్ష్మి, పద్మ, సైదమ్మ, మంగమ్మ, నర్సయ్య, వీరబాబు, నారాయణ, రామారావు, శ్రీను, నరసింహాచారి, కోటయ్య, సైదా, తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.36 వేల ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని విద్యానగర్‌కు చెందిన మారపాక పద్మ బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతోంది. దీంతో ఆమె ఆపరేషన్ నిమిత్తం యారవ సురేష్‌తో పాటు అతని స్నేహితులంతా కలిసి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా దాతల నుంచి రూ.36 వేలు సేకరించారు. గురువారం నేరేడుచర్లలో పద్మ కుమారుడు నాగరాజుకు నగదు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో చిన్నపల్లి శ్రీనివాస్, వేమూరి నారాయణ, మన్నెం దుర్గారావు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5 వేలు..

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా గ్రామ పంచాయతీ సిబ్బంది బాలునాయక్ ఇటీవల బావిలో కాలు జారిపడి చనిపోయాడు. దీంతో గురువారం బాధిత కుటుంబానికి సీఐటీయూ అనుబంధ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్ మియా, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, ఎం. మైసయ్య, మోతీలాల్, సైదానాయక్, రవి, ప్రభాకర్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చుతున్న చలివేంద్రాలు



బరాఖత్‌గూడెంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రుక్మారావు

మునగాల : వేసవిలో బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని యశోద ఫౌండేషన్ వ్యవస్థాపక, చైర్మన్ డాక్టర్ నరాల రుక్మారావు అన్నారు. గురువారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ బస్టాండ్ చౌరస్తాలో యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎవరైన ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే తనవంతు సాయం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి రవి, సామాజిక ఉద్యమకారుడు గంధం సైదులు, గ్రామపెద్దలు కాలే సామియేలు, కరుణాకర్, రెడ్డిపల్లి లక్ష్మణ్, ఇంజనీర్ శంకర్‌రావు, తంబిర శ్రీనివాసరావు, బోనాల శ్రీనివాస్, చల్లా గుర్వయ్య, షేక్ ఇమామ్ వలీ, యూసఫ్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న శ్రీనివాస్

కోదాడ : చదువుకు మించిన సంపద లేదని, పేద విద్యార్థుల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క) నిర్వాహకులు అన్నారు. కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో ఆస్క ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను గురువారం అందించిన భారత్ మెడికల్స్ యజమాని యాదా శ్రీనివాస్, రామచంద్ర మెడికల్స్ యజమాని రవిలను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బల్గూరి దుర్గయ్య, మాతంగి ప్రభాకర్, యలమర్తి శౌరి, బుచ్చారావు, రవికుమార్, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ‘శుభవార్త’ వార్షికోత్సవం

- దివ్యబలిపూజ నిర్వహించిన ఫాదర్ బాలశౌరి
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



మఠంపల్లిలోని శుభవార్త చర్చిలో దివ్యబలి పూజ నిర్వహిస్తున్న ఫాదర్ బాలశౌరి

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త (దేవాలయం) చర్చి వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సూర్యాపేట ఫాదర్ బాలశౌరి పాల్గొని దివ్యబలిపూజ చేసి క్రైస్తవ భక్తులకు సందేశం ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం క్రైస్తవులకు దివ్య ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా చర్చిలో ఉదయం దివ్య బలి పూజ, మధ్యాహ్నం మేరీమాత, జీసెస్‌లకు కొవ్వొత్తుల సమర్పణ గావించారు. సాయంత్రం అందంగా అలంకరించిన తేరుపై ఏసుక్రీస్తు, మేరీమాత ప్రతిమలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, ఖమ్మం జిల్లాలకు చెందిన విచారణ గురువులు అల్లం బాల, బాలరెడ్డి, జోసెఫ్, కాకుమాను రాజు, తుమ్మా రాకేష్, భాగ్యరాజ్, సెబాష్టియన్, అరుణ్‌సాగర్, జార్జిలతో పాటు సిస్టర్లు, బ్రదర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు. కాగా, వేడుకల్లో క్రైస్తవ భక్తిగేయాలు విశేషంగా ఆకట్టున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గాదె లూర్థుమారెడ్డి, గాలి చిన్నపురెడ్డి, కాకుమాను జోసెఫ్, శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్ రెడ్డి, చర్చి కమిటీ సభ్యులు బోయపాటి ఆంతోని రెడ్డి, బాలరెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, జార్జిరెడ్డి, సంగా ఆంతోని, జోసెఫ్‌రెడ్డి, రాయ చిన్నపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్థనల్లో పాల్గొన్న విచారణ గురువులు, క్రైస్తవులు



ఏసుక్రీస్తు, మేరీమాత ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

నేటి నుంచి ఎడ్ల పందేలు..

మఠంపల్లిలోని వీవీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 26 నుంచి 29 వరకు చర్చి కమిటీ, శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ పోటీలను రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు, పాదర్లు ప్రారంభిస్తారని తెలిపారు. ఇప్పటికే సుమారు 60 జతలకు పైగా గిత్తలు పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. విజేతలకు రూ.9 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కోదాడలో హనుమాన్ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, తదితరులు

కోదాడ : పట్టణంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో గురువారం వీరహనుమాన్ విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం అభయాంజనేయస్వామి దేవాలయంలో నల్గొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. కాగా, దేవాలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిపై రంగా థియేటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ అభయాంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ సభ్యులు కన్నెబోయిన వెంకట్, యాదా సురేష్, అంబడికర్ర వెంకటేష్, రచ్చ సతీష్, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డి గెలుపే లక్ష్యం



బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

చిలుకూరు : బీఆర్ఎస్ పార్టీ నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం చిలుకూరులో పార్టీ నాయకుడు అంబాల రాంబాబు ఇంట్లో ఎంపీ ఎన్నికలపై జరిగిన పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతుల పక్షాన పోరాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ కటికం సత్తయ్యగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానివియా, పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, సీనియర్ నాయకులు కస్తూరి నర్సయ్య, మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, నాయకులు అక్కినపల్లి జానకీరామాచారి, కడియాల వెంకటేశ్వర్లు, ములుగూరు నాగరాజు, వాసు, బెల్లంకొండ నాగయ్య, తాళ్లూరి శ్రీను, అంబాల వెంకటి, షేక్ పాషా, అంబాల రాంబాబు, లింగరాజు, చిలువేరు నర్సయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో మలేరియా వ్యాధి నివారణ



హుజూర్‌నగర్‌రూరల్ : లింగగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



అనంతగిరి : త్రిపురవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూర్‌నగర్‌రూరల్ : పరిశుభ్రతతో మలేరియా వ్యాధిని నివారించవచ్చని కమ్యూనిటీ హెల్త్ అధికారి పద్మ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. మలేరియా వ్యాధి ఆడ అనాఫిలియస్ దోమ కుట్టడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. చలి జ్వరంతో పాటు తలనొప్పి, ఒళ్లు నొప్పులు రావడం వ్యాధి లక్షణాలు అని తెలిపారు. వ్యాధి నివారణకు ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బసీ దవాఖానా డాక్టర్ వాణి, సూపర్‌వైజర్ పద్మ, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్, రమేష్, విజయ, శ్రీలలిత, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన కల్పించాలి

మోతె : మలేరియాపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగరాజు అన్నారు. గురువారం మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అనంతగిరి : కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డా.లక్ష్మీప్రసన్న అన్నారు. అంతర్జాతీయ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం త్రిపురవరంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.హరినాథ్, ప్రసన్న, శ్రావణి, విజయ్‌కుమార్, కృష్ణమూర్తి, శ్రీదేవి, విజయ, మహేశ్వరి, రమాదేవి, రమ, మంజుల, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర ఇండస్ట్రియల్, తమ్మర గ్రామం, అగ్రికల్చర్ ఫీడర్ లోని 11 కెవీ లైన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు గాను శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ రూరల్ ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు తమకు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, వాటిని సాధించేందుకు కృషి చేసి విజేతలుగా నిలవాలని కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలోని శ్రీ మేధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎం.సైదులు, ఎస్. శ్వేతలు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వారిని గురువారం ఆయన కోదాడలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బండారు కవిత, తదితరులు

నడిగూడెం : బీజేపీ గెలుపుతోనే సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు, మండల ఎన్నికల ఇన్‌చార్జి బండారు కవిత తెలిపారు. గురువారం నడిగూడెం మండలంలోని రత్నవరంలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు లతీఫ్, శోభారాణి, మేకల నాగరాజు, రౌతు వీరేంద్రవర్మ, నూకపంగు గుర్వయ్య పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ ప్రారంభం



చిలుకూరు : బీఎల్‌ఓలకు ఓటర్ స్లిప్‌లు అందజేస్తున్న తహసీల్దార్ ధృవకుమార్

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఎల్‌ఓల ద్వారా ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీ ప్రారంభమైందని హుజూర్‌నగర్ నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అసెంబ్లీ సెగ్మెంట్‌లోని బీఎల్‌ఓలకు ఓటర్ స్లిప్‌లను అందజేసినట్లు తెలిపారు. స్లిప్‌లను బీఎల్‌ఓలు మాత్రమే పంచాలని, అలాకాకుండా వారి తరఫున ఎవరైనా పంచితే సదరు బీఎల్‌ఓను సస్పెండ్ చేస్తామని తెలిపారు. ఓటరు సమాచార స్లిప్‌లను సదరు వ్యక్తికి గాని వారి కుటుంబసభ్యులకే ఇవ్వాలని వేరే ఎవరికీ కూడా ఇవ్వొద్దని తెలిపారు. పంపిణీ తర్వాత మిగిలిన వాటిని పోలింగ్ స్టేషన్ వారీగా అక్షర క్రమంలో అమర్చి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

స్లిప్‌లను బీఎల్‌ఓలే పంపిణీ చేయాలి

మునగాల : మండల వ్యాప్తంగా గురువారం నుంచి పార్లమెంట్ ఎన్నికల ఓటరు స్లిప్‌ల ను బీఎల్‌ఓల ద్వారా పంపిణీని ప్రారంభించినట్లు తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు స్లిప్‌లను కేవలం బీఎల్‌ఓలు మాత్రమే పంచాలని, అలాకాకుండా వారి బంధువులు, కుటుంబసభ్యులు పంచకూడదని తెలిపారు. స్లిప్పుల పంపిణీలో రాజకీయ నాయకులు, కార్యకర్తలు వెంట ఉండకూడదని చెప్పారు.

నెలఖరులోగా ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలి

పాలకవీడు : ప్రతి ఓటరుకు ఈ నెలాఖరులోగా ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీదేవి బీఎల్‌ఓలను ఆదేశించారు. గురువారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక ఎస్ఐ లక్ష్మీనర్సయ్యతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ స్లిప్‌లను కేవలం బీఎల్‌ఓలు మాత్రమే ఇంటింటికి పంపిణీ చేయాలని సూచించారు. బీఎల్‌ఓల సూపర్‌వైజర్, సెక్టోరల్ అధికారి సమన్వయంతో స్లిప్‌లు పంపిణీ చేసుకోవచ్చన్నారు.

ఓటర్ స్లిప్‌లు సకాలంలో అందజేయాలి

చిలుకూరు : ఎంపీ ఎన్నికల ఓటింగ్‌కు రెండు, మూడు రోజుల ముందే బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటర్లకు ఓటర్ స్లిప్‌లు అందజేయాలని తహసీల్దార్ ధృవకుమార్ సూచించారు. గురువారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బీఎల్‌ఓలకు ఓటర్ స్లిప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, సీనియర్ అసిస్టెంట్ శైలజ, ఆర్‌ఐలు మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, మంజుల, జూనియర్ అసిస్టెంట్ వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

నడిగూడెం : పార్లమెంట్ ఎన్నికల ఓటరు స్లిప్‌లను ప్రతిఒక్క ఓటరుకు అందజేయాలని తహసీల్దార్ హేమామాలిని కోరారు. గురువారం నడిగూడెంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌ఓల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం బీఎల్‌ఓలకు 29 పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. కాగా, గ్రామాల్లో కూడా ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ గోపాలకృష్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ, అనుబంధ ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రం ప్రభుత్వం హరించి వేస్తుందని ఆరోపించారు. కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్మిక వర్గం మే డే స్ఫూర్తితో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇందిరాల వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, అమరవరపు పున్నయ్య, ప్రజా సంఘాల నాయకులు ఎం.పాపారావు, డి.సత్యానందం, బి.సైదులు, పి.వెంకన్న, ఎల్.ధనమూర్తి, ఆర్.సుబ్బారావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.వీరయ్య, డి.వీరస్వామి, పంకజ్, సంజయ్, జె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ రావడంపై హర్షం



వంటిపులి లాస్య

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లకు చెందిన వంటిపులి సంజీవరావు కుమార్తె వంటిపులి లాస్య హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కాలేజీలో చదువుతూ ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 440 మార్కులకు గాను 438 సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం పట్ల కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, డీసీసీ అధికార ప్రతినిధి కుక్కల నాగరాజులు స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బండి వెంకటరెడ్డి, సైదులు, వెంకన్న, సలీం, మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామికి గజవాహన సేవ



స్వామివార్లకు పల్లకీసేవ నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీవేణుగోపాలస్వామి రుక్మిణి సత్యభామ గోదాదేవికి గురువారం ప్రత్యేక పూజాలు చేశారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, నిత్యహోమం నిర్వహించారు. సాయంత్రం బూరుగడ్డ మాచవరం గ్రామాల్లో గజవాహనముపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిత్యహోమం, బలిహరణ, ఆరగింపు, నిత్యపూర్ణాహుతి, మంగళాశాసనం, తీర్థప్రసాద వితరణ వంటి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మణారావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు.. తప్పిన ప్రమాదం



కాగితరామచంద్రాపురం వద్ద మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నడిగూడెం : వ్యవసాయ పొలంలో వరి కొయ్యలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సమీప గ్రామాన్ని మంటలు చుట్టుముట్టాయి. ఈ సంఘటన నడిగూడెం మండలంలోని కాగితరామచంద్రాపురంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం సమీపాన వరి కొయ్యలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో ఆ మంటలు క్రమేపీ పెద్దవై కాగితరామచంద్రాపురం డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమీపాన చుట్టుముట్టాయి. పలువురు రైతుల విద్యుత్ మోటార్లు, పైపులైన్‌లు దగ్ధమయ్యాయి. మంటలవ్యాప్తినిగమనించిన గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్తులు దాదాపు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. ఘటన స్థలాన్ని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, డీపీఓ సురేష్‌కుమార్, డీఎల్‌పీఓ యాదగిరిరావు, తహసీల్దార్ హేమామాలిని, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎంపీఓ దుర్గాప్రసాద్ పరిశీలించారు. రాత్రి వేళ తిరిగి మంటలు రాకుండా పలువురు అధికారులకు విధులు అప్పగించారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులకు వాలీబాల్స్ అందజేస్తున్న అశోక్, దాతలు

కోదాడరూరల్ : వేసవిలో ఏర్పాటు చేసే క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మై హోం ఎస్టేట్ మేనేజర్ చెరకు అశోక్ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే వాలీ బాల్ శిక్షణకు దాతలు, సీనియర్ కోచ్, జాతీయ మాజీ క్రీడాకారుడు తమ్మిశెట్టి శ్రీనివాసరావు, సూర్యానారాయణ రాజులు వాలీబాల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఈ వేసవి కాలంలో వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇప్పించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ జూలూరు వీరభద్రం, విష్ణువర్ధన్‌రావు, ఖలీద్‌సాహెబ్, ఖాజా, ఎస్‌కె.నయీం, అలెక్స్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా పశు వైద్య దినోత్సవం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యశాలలో ఏడీఏ శంకర్‌రావు, మండల పశు వైద్యాధికారి భాణోతు రవిలను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, కర్రి సూర్యనాయణరెడ్డి, క్రాంతికుమార్, యూసుఫ్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు క్రైస్తవుల వినతి

గరిడేపల్లి : మండల కేంద్రంలో క్రైస్తవ భవనం, శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించాలని బుధవారం క్రైస్తువులు హుజూర్‌నగర్ నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ గౌరవ అడ్వైజర్ మంద భిక్షం ఆధ్వర్యంలో గరిడేపల్లిలో తహసీల్దార్ బండ కవితకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ ముగిసాక సర్వే చేయించి స్థలాన్ని కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఉదయ్‌బాబు, తలకప్పల కృపాదానం, ముళ్ల జాకోబ్, రమేష్, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

వాయిలసింగారంలో వైద్య శిబిరం

అనంతగిరి : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోదాడకు చెందిన సంకల్ప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ అపూర్వ కోరారు. గురువారం మండలంలోని వాయిలసింగారంలో ఆ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సిబ్బంది మధు, సందీప్, గౌస్, జరీనా, మాదవి, నవీన్, భరత్, వెంకటేష్, కొండలు పాల్గొన్నారు.

హైవేపై వాహనాలు నిలపకుండా చూడాలి

మునగాల : జాతీయ రహదారిపై వాహనాలు నిలిపకుండా చూడాలని సామాజిక ఉద్యమకారుడు గంధం సైదులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. డ్రైవర్లు విశ్రాంతి కోసం హైవేల పక్కన వాహనాలు నిలుపుతుండడంతో వాటిని కార్లు, బైక్‌లు అదుపు తప్పి ఢీకొడుతూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. భారీ వాహనదారులు, లారీ డ్రైవర్లు తమ వాహనాలను జీఎమ్మార్ సంస్థ నిర్మించిన విశ్రాంతి ప్రదేశాల్లో మాత్రమే నిలిపేవిధంగా సంబంధిత శాఖ సిబ్బంది చూడాలని తెలిపారు. హైవేపై ప్రమాదాలను నివారించేందుకు హైవే అథారిటీ, పోలీసు సిబ్బంది నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.

కొనసాగుతున్న ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

నడిగూడెం : మండలంలోని రామాపురంలో శ్రీబాల గురప్ప ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం గణపతి పూజ, వేద పారాయణం, హోమాలు, రక్షణోద్ధారణ, నవకలశస్థాపనం, పంచామృతాభిషేకాలు, జలాధివాసం, క్షీరాధివాసం, నీరాజన మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రతిష్ఠ, అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

చిలుకూరు : ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు నీడ కోసం గుడారాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు అన్నారు. గురువారం చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేట్లు తదితరులు పాల్గొన్నారు.